నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 25 ఆగస్టు 2024 | HYDERABAD

55 రోజులు.. 8,826 కి.మీలు

ఈయన పేరు శివన్‌కుట్టి..రిటైర్డ్ ఆర్మీ అధికారి.. వయస్సు 75 ఏండ్లు.. ఈ వయస్సులోనూ సాహోసోపేత బైక్ రైడ్ చేపట్టి.. ఈ తరం యువతకు తానేం తక్కువ కాదని నిరూపించారు. హైదరాబాద్ టు లడఖ్..లడఖ్ టు కన్యాకుమారి టు..హైదరాబాద్ ఇలా సోలో బైక్ రైడ్‌తో దేశభక్తి చాటుతూ..జాతీయ జెండాను రెపరెపలాడించారు. 'ఈ ఏడాది మే 26న నా యాత్ర ప్రారంభమై.. జూలై 20న ముగిసింది. 55 రోజుల్లో 8,826 కిలోమీటర్ల మేర యాత్ర చేశా.. దేశం కోసం, ఆరోగ్యం కోసం సమయాన్ని కేటాయించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది'. అని శివన్‌కుట్టి అన్నారు.

- సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ)

బంజారాహిల్స్, తట్టిఖాన సెక్షన్ల పరిధిలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. నగరానికి సరఫరా అవుతున్న నీటి వనరులు, తాగునీటి సరఫరా తీరుతెన్నులు, నీటిని శుద్ధి చేసే రిజర్వాయర్లు, నీటి నాణ్యతను పెంచే క్లోరిన్ ఆపరేషన్స్ తదితర అంశాలను పరిశీలించారు. లైన్‌మెన్‌లు, ఇతర వాటర్, సీవరేజీ బోర్డు సిబ్బంది, నెట్‌వర్క్ అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మద్దతుగా కదిలివచ్చిన మహిళాలోకం

శనివారం బుద్ధ భవన్ వద్ద మహిళా కమిషన్ ఎదుట హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, కార్యకర్తలు తరలివచ్చారు. అదే సమయంలో కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఒకరినొకరు తోసుకోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వారిని అదుపు చేసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

వెనక్కి తగ్గిన ఎల్‌అండ్‌టీ

మెట్రో ప్రయాణికుల ఆందోళనలతో పెయిడ్ పార్కింగ్ నిర్ణయం వాయిదా

సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ ఆవరణలోని వాహనాల పార్కింగ్ ఫీజుల విషయంలో హైదరాబాద్ మెట్రో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్ర స్టేషన్ల వద్ద పెయిడ్ పార్కింగ్ విధానాన్ని అమలు చేయాలన్న నిర్ణయంపై ఎల్‌అండ్‌టీ మెట్రో వెనక్కి తగ్గింది. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించే వరకు అమలును వాయిదా వేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈనెల 25 నుంచి నాగోల్‌లో, సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్‌లలో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం పట్ల ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. 'పెయిడ్ పార్కింగ్' రద్దు చేయకపోతే నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద మహాధర్నా చేస్తామని ప్రయాణికులు హెచ్చరించడంతో ఎల్‌అండ్‌టీ దిగివచ్చింది. ఇప్పటికే కారిడార్-1 (ఎల్బీనగర్-మియాపూర్), కారిడార్-3 (నాగోల్- రాయదుర్గం) మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో కోచ్‌లలో స్థలం ఉండటం లేదంటూ చాలా కాలంగా చెబుతున్నా.. మెట్రో అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే అనేకసార్లు ప్రయాణికులు మెట్రో అధికారులకు, ప్రభుత్వానికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండాపోయింది. ఆ సమస్య అలా ఉండగానే.. కొత్తగా నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్‌లలో ఒకేసారి భారీ ఎత్తున పెయిడ్ పార్కింగ్ ఫీజులను నిర్ణయించి, అమలు చేస్తామని ప్రకటించడంతో ప్రయాణికులంతా ఆందోళన చెందారు. ఈనెల 14న మెట్రోస్టేషన్‌లో నిరసన తెలిపారు.

అధికంగా ఐటీ..ప్రైవేటు ఉద్యోగులే..

మెట్రో రైళ్లలో అధికంగా ఐటీ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులే రాకపోకలు సాగిస్తున్నారు. నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్లాలంటే ప్రతి రోజూ రానుపోను రూ. 120 వరకు మెట్రో చార్జీ అవుతుండగా, కార్ పార్కింగ్ చేస్తే మరో రూ. 120, మెట్రోస్టేషన్ నుంచి ఆఫీసుకు వెళ్లేవరకు మరో రూ. 30-40ల దాకా ఖర్చవుతున్నది. ఇలా ఒక్క రోజు రవాణా చార్జీలే రూ. 270 నుంచి రూ.300 ల దాకా అవుతున్నది. ఇంటి నుంచి మెట్రోస్టేషన్.. అటు నుంచి పనిచేసే కార్యాలయాల వరకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడంతో ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి వాటిని ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది తమకు భారంగా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయం మెట్రో స్టేషన్‌లో పార్కింగ్ చేసి.. రైలులో ఆఫీసుకు వెళ్లి రావడానికి కనీసం 9 గంటల పైనే పడుతున్నది. ఇదిలా ఉంటే 8 గంటల పార్కింగ్‌కు కార్లకు ఫీజు 120 రూపాయలు నిర్ణయించడాన్ని ప్రయాణికులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ మెట్రో స్టేషన్లలోనే ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే తాజాగా ఎల్‌అండ్‌టీ పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని వాయిదా వేసింది.

పేరుకే 'గ్రీవెన్స్'

మేడ్చల్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రైతులకు రుణమాఫీ అందని ద్రాక్షల మారింది. రుణమాఫీ అందని వారు గ్రీవెన్స్ సెల్‌లను ఆశ్రయిస్తున్నా.. ఫలితం లేకుండాపోవడంతో రైతులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 24 గ్రీవెన్స్ సెల్‌లను ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు.. ఒక్కటంటే ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 600 పైచిలుకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నా.. వేల సంఖ్యలో అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నదాతలు మండిపడుతున్నారు.

'గ్రేటర్ విద్యుత్'లో ఎస్ఈల బదిలీలు

సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ల బదిలీలు చేపట్టింది. పది సర్కిళ్లలో ఇప్పటికే హబ్సిగూడ ఎస్ఈగా కొద్ది రోజుల కిందట బ్రహ్మం బదిలీ అయ్యారు. తాజాగా శనివారం 9 సర్కిళ్లలో పని చేస్తున్న ఎస్ఈలను బదిలీ చేస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈగా చంద్రశేఖర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈగా డీఎస్ మోహన్, మేడ్చల్ సర్కిల్ ఎస్ఈగా ఎం.రవికుమార్, హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్ఈగా సోమిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈగా మాధవరెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈగా ఎల్. గోపయ్య, బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈగా కరుణాకర్ బాబు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈగా వెంకన్న, సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈగా శ్రీనాథ్‌ను బదిలీ చేస్తూ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి సస్పెండ్

మణికొండ, ఆగస్టు 24 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జలమండలి కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఇటీవల ఓ నల్లా కనెక్షన్ కోసం రూ.30 వేలు లంచం తీసుకుంటూ.. రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన స్ఫూర్తి రెడ్డి సస్పెండయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎస్. నవీన్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించారు.

భయపెట్టి.. ఆశపెట్టి!

- అందినకాడికి దోచుకున్న సైబర్ నేరగాళ్లు
- గుజరాత్‌లో మన పోలీసుల స్పెషల్ ఆపరేషన్
- 20 కేసుల్లో 36 మంది సైబర్‌నేరస్తుల అరెస్ట్
- దేశవ్యాప్తంగా 983 కేసులతో నిందితులకు లింక్

సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): వివిధ రకాలుగా అమాయకులను దోచేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆట కట్టించారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు..స్పెషల్ ఆపరేషన్ చేపట్టి..నిందితులను పట్టుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలో 7 బృందాలతో గాలించి.. పలు కేసులను ఛేదించారు. ఈ స్పెషల్ ఆపరేషన్‌లో 20 కేసుల్లో 36 మంది సైబర్‌నేరగాళ్లను పట్టుకున్నామని, వీరికి దేశ వ్యాప్తంగా 983 కేసులతో సంబంధాలున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

వృద్ధురాలికి ఫోన్ చేసి..

సికింద్రాబాద్‌కు చెందిన 74 ఏండ్ల వృద్ధురాలికి తాము ముంబై అందేరీ పీఎస్ పోలీసులం మాట్లాడుతున్నామని, ఫెడెక్స్ కొరియర్‌లో 'మీ పేరుతో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి..మీపై మనీలాండరింగ్ కేసు నమోదైంది' అంటూ.. కాల్ చేసి.. భయపెట్టి.. రూ.1.6 కోట్లు దోచేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కోల్‌కత్తకు చెందిన దీపక్ రావత్ దుబాయ్‌లో ఉంటూ గుజరాత్‌కు చెందిన సాగర్ గోర్ధానభాయ్ ప్రజాపతి, పరంకర్ కీరిట్ నాథుభాయ్ సహకారంతో బ్యాంకు ఖాతాలను సమకూర్చుకొని.. ఈ మోసం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రధాన నిందితుడిపై ఎల్‌ఓసీ జారీ చేయగా, మిగతా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రూ. 10.08 లక్షల నగదు, వివిధ బ్యాంకు చెక్ పుస్తకాలు, 22 బ్యాంకు ఖాతాల డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో..

ట్రేడింగ్ పేరుతో రాంకోఠికి చెందిన ఓ వ్యాపారికి వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్‌నేరగాళ్లు..'మేం చెప్పినట్లు ట్రేడింగ్ చేస్తే..500 శాతం లాభాలొస్తాయి'..అంటూ నమ్మించి దఫ దఫాలుగా బాధితుడి వద్ద నుంచి రూ.2 కోట్లు వసూలు చేసి మోసం చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి.. బ్యాంకు ఖాతాలు గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన బృందం స్పిన్నింగ్ మిల్ వ్యాపారం చేసే చుదాసమ కుల్‌దీప్‌సిన్హా అనోప్ సిన్హా ప్రైవేట్ ఉద్యోగి అయిన జెడేజ దైవత్‌సిన్హ కృతిసిన్హా, కారు డ్రైవర్ అయిన సినోజియ కేతాన్ సురేశ్‌భాయ్‌లను పట్టుకున్నారు. ఈ ముగ్గురు బ్యాంకు ఖాతాలు అపరేట్ చేస్తూ విదేశాల్లో ఉండే ప్రధాన నిందితులకు సహకరిస్తుంటారు. బాధితులు ఆయా బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసిన నగదును హవాల మార్గంలో ప్రధాన నిందితులకు పంపిస్తున్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ అరెస్ట్..

బేగంపేటకు చెందిన రిటైర్డు ఉద్యోగికి వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్‌నేరగాళ్లు.. మోతెలై.కామ్ పేరుతో ఉన్న ఒక అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయించి.. దాని ద్వారా ట్రేడింగ్ చేయిస్తూ రూ. 60.88 లక్షలు దోచేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంకు ఖాతాల ఆధారంగా గుజరాత్‌కు వెళ్లి దర్యాప్తు జరిపారు. కనాని నికుంజ కిశోర్ భాయ్ వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్, ప్రవీణ్ భాయ్ కలుభాయ్ వసోయ అనే మరో వ్యక్తితో కలిసి ఈ నేరాలు చేస్తున్నట్లు గుర్తించారు. మొదట్లో కొన్ని లాభాలు చూపించి, ఆ తరువాత భారీగా పెట్టుబడులు పెట్టిస్తూ ఈ ఇద్దరు అమాయకులైన వారి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నట్లు తేలింది. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రూ. 27.20 లక్షల నగదు, 226 చెక్ బుక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఈ నిందితులకు 142 కేసులతో సంబంధం ఉన్నట్లు వెల్లడైంది.

బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు చదువులో వెనకబడితే వారిపై ప్రత్యేక దృష్టి సారించి రాణించేలా ప్రోత్సాహం అందించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. తిరుమలగిరి మండలంలోని బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో వంటగది, స్టోర్ రూం, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను చదివించారు. విద్య అనేది చాలా శక్తివంతమైనదని విద్యార్థులకు కలెక్టర్ చెప్పారు. బాగా చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటాజి, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ సింగ్, వసతి గృహ సంక్షేమ అధికారి ఎం. నీలిమా, తహసీల్దార్ ఎస్. అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

వేగన్ వాక్..

శనివారం సంజీవయ్య పార్క్ వద్ద విజ్ఞాన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జంతువులను కాపాడాలని..వాటి ద్వారా వచ్చే పాలు..మాంసము..గుడ్లు వాడకూడదని..జంతువులను స్వేచ్ఛగా జీవించనీయాలంటూ.. జంతు ప్రేమికులు వాక్ ద్వారా అవగాహన కల్పించారు.

మాదాపూర్ హైటెక్స్ గ్రౌండ్‌లో శనివారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎన్ఎండీసీ 14 ఎన్జీఓలతో కలిసి 'హైదరాబాద్ 5కే రన్' 13వ ఎడిషన్‌ను నిర్వహించింది. ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ రన్‌ను ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా, ఈడీ జైపాల్‌రెడ్డి, ఐబీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ హెడ్ బ్రాంచ్ బ్యాంకింగ్ సౌత్ నిరీశ్ లలాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి సమతుల్యమైన ఆహారంతో పాటు వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం కావాలని పిలుపునిచ్చారు.